

## పరిశోధనలతోనే బాటలు

ప్రజల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు జరగాలని తెలంగాణ యూనివర్సిటీ కామర్స్ డీన్ యాదగిరి పేర్కొన్నారు.

- 8లో ▸



## ఎరువు..బరువు

పంట పొలాల్లో భూసారం పెంచేందుకు ఉపయోగపడే సేంద్రియ ఎరువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.

- 10లో ▸

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.0 /25.0

ఉదయం నుంచి ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం చల్లటి గాలులు వీస్తాయి.




## న్యూస్‌రీల్

### 19న జెడ్పీ సర్వసభ్య సమావేశం

నిజామాబాద్‌నాగారం : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో గోవింద్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10.30గంటకు ప్రారంభమవుతుందన్నారు. కరోనా వ్యాప్తి దృష్ట్యా అందరు తప్పనిసరిగా మాస్కులు ధరించాలన్నారు.

### రేపు ఉద్యోగుల పెన్షన్ అదాలత్

నిజామాబాద్ సిటీ : ఉద్యోగుల పెన్షన్ స్కీమ్ పెన్షనర్ల సమస్యలకు సంబంధించి ఈనెల 13న పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ సహాయక కమిషనర్ బి మధుసూదనచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షన్ అదాలత్ ఉదయం 11 గంటల నుంచి 11.40 గంటల వరకు ఉంటుందన్నారు. పెన్షనర్ల ఫిర్యాదులను వీడియో కాన్ఫరెన్స్ తెలుసుకుంటామని సహాయ కమిషనర్ తెలిపారు. ఫిర్యాదుదారులు వెబెక్స్ వెబ్‌సైట్‌లో మీటింగ్ నంబర్ 2641. 441.4029 పాస్‌వర్డ్ ఈఎస్ఎఫ్ 1234 ఎంటర్ చేసి కాన్ఫరెన్స్‌లో పాల్గొనా లని ఆయన సూచించారు.

### కలెక్టర్‌కు సీతారాముల తలంబ్రాలు అందజేత



ఖలీల్‌వాడి : భద్రాద్రి సీతారాముల తలంబ్రాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు మంగళవారం ఆర్టీసీ ఆర్ఎం ఉషాదేవి అందజేశా రు. ఇటీవల సీతారాముల కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా భక్తులకు ఆ ర్టీసీ ద్వారా అందించామని ఆమె పేర్కొన్నారు. ఆర్టీసీ అధికారులు తదితరులు ఉన్నారు.

### మాజీ మేయర్ సంజయ్ ఇంటిపై దాడి



ఖలీల్‌వాడి : నిజామాబాద్ మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ ఇంటి గేట్‌ను ఓ వ్యక్తి ఢీకొన్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మంగళవారం వినాయక్‌నగర్‌లోని ధర్మపురి సంజయ్ ఇంటికి కారులో సందీప్ వర్మ అలియాస్ చోర్‌బబ్లూ వచ్చారు. ఇంటి ముందు గేట్లు మూసివేసి ఉన్నాయి. దీంతో కారును డైరెక్ట్‌గా ఇంట్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. అక్కడ ఉన్న పనివాళ్లు లోపలికి వెళ్లేందుకు అభ్యంతరం వ్యక్తం చేయగా కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. దీంతో వారిపై సందీప్ వర్మ అలియాస్ చోర్ బబ్లూ దాడికి పాల్పడ్డారు. దీంతో వారు డయల్ 100కు ఫోన్ చేశారు. పోలీసులు వచ్చేంతలోపే అక్కడి నుంచి అతడు పరారయ్యారు. ఈ విషయమై ఎస్సై సందీప్‌ను వివరణ కోరగా దాడిలో గాయపడ్డవాళ్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సందీప్ వర్మపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

### సదరం క్యాంప్‌లు ఖరారు

**14న స్లాట్ బుకింగ్స్**

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): జిల్లాలో సదరం క్యాంపుల నిర్వహణకు తేదీలు ఖరారైనట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి చందర్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 19,26 తేదీల్లో జిల్లా జనరల్ ప్రభుత్వ ఆస్పత్రిలో క్యాంప్‌లు జరుగుతాయన్నారు. ఇందుకు జిల్లాలోని దివ్యాంగులు ఈనెల 14న మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. కేటాయించిన తేదీల్లో రశీదును వెంట తీసుకుని క్యాంపులకు హాజరుకావాలన్నారు.

# గుడ్డిగా లెక్క..



- నన్ ఫ్లవర్‌కు బదులు వరి పంట నమోదు
- బోధన్ డివిజన్‌లో వెలుగు చూసిన ఘటన
- తారుమారైన 200 ఎకరాల పంటల వివరాలు
- క్షేత్రస్థాయికి వెళ్లకుండానే క్రాప్ బుకింగ్ చేసిన వైనం
- ఏడుగురు ఏఈవోలకు మెమోలు జారీ !

**ఆశించిన మాదిరిగానే మార్కెట్‌లో మంచి ధర వస్తుండటంతో పొద్దు తిరుగు పంటను** అమ్ముకునేందుకు మార్కెట్‌కు వెళ్లిన రైతులకు చుక్కెదురైంది. కొంతమంది వ్యవసాయ విస్తీర్ణ అధికారుల నిర్లక్ష్యం రైతులకు పంటను అమ్ముకోలేని దుస్థితిని కల్పించింది. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లకుండానే ఆన్‌లైన్ క్రాప్ బుకింగ్‌లో పొద్దు తిరుగుడు పంటకు బదులు వరి పంటగా నమోదు చేశారు.

ఇందూరు (నిజామాబాద్ అర్బన్) : పంటల వివరాలను వ్యవసాయాధికారులు గుడ్డిగా నమోదు చేస్తున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లకుండానే రైతులు ఏ పంట వేశారని లెక్కలు వేస్తున్నారు. ఆఫీసుల్లో ఉంటూ ప్రభుత్వానికి రిపోర్టులు పంపుతున్నారు. తద్వారా ఆన్‌లైన్ క్రాప్ బుకింగ్‌లో తప్పులు దొర్లుతున్నాయి. ఒక పంటకు బదులు మరో పంట సాగైనట్లు ఆన్‌లైన్‌లో నమోదవుతున్నాయి. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ పంటను అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. అచ్చంగా బోధన్ డివిజన్‌లో ఇదే జరిగింది. నాలుగైదు మండలాల్లోని కొంతమంది రైతులు పొద్దు తిరుగుడు పంటను సాగు చేస్తే, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు వరిపంటను సాగు చేస్తున్నట్లుగా క్రాప్ బుకింగ్ యాప్‌లో వివరాలను నమోదు చేశారు. రైతు వేదికలకు కనుచూపు మేరలో రైతులు సాగు చేస్తున్న పంటలేవో తెలుసుకోలేని పరిస్థితిలో ఏఈవోలు ఉండడం గమనార్హం. ఈ ఘటనపై జిల్లా వ్యవసాయాధికారి ఆగ్రహించినట్లు తెలిసింది. బాధ్యులైన కల్దుర్కి, బోధన్ టౌన్, సాలురా, జాడి, నీల, కందకుర్తి, జన్నపల్లి ఏఈవోలకు మెమోలు జారీ చేసి హెచ్చరించినట్లు విశ్వసనీయ సమాచారం.

**రోల్ బ్యాక్ కోసం కమిషనరేట్‌కు..**

పంటల వివరాలు తప్పుగా నమోదైన విషయాన్ని రైతులు వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం జిల్లా వ్యవసాయాధికారి దృష్టికి కూడా వెళ్లింది. ఆన్‌లైన్ నమోదులో జరిగిన తప్పుల కారణంగా దాదాపు 2 వేల క్వింటాళ్ల వరకు పంటను అమ్మకుండా రైతులు కొనుగోలు కేంద్రాల్లో అలాగే ఉంచారు. దీంతో ఈ విషయాన్ని డీఏవో సీరియస్‌గా తీసుకున్నారు. కాని జిల్లాలో దీనిని సరిచేసే అవకాశం లేనందున కమిషనరేట్‌కు సంప్రదించారు. 200 ఎకరాల్లో నమోదైన వరిపంట స్థానంలో పొద్దు తిరుగుడు పంటను నమోదు చేయాలని కోరారు. ఇప్పటి వరకు కొంత రోల్ బ్యాక్ కాగా, మరికొంత కావాల్సి ఉంది.

**ఆఫీసులకే పరిమితమై..**

రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల క్రితం వ్యవసాయ విస్తీర్ణ అధికారుల వ్యవస్థను తెచ్చింది. 5,000 ఎకరాలకు ఒక ఏఈవోను నియమించగా, జిల్లాలో 106 మంది పనిచేస్తున్నారు. వీరికి కేటాయించిన క్లస్టర్లలో సాగవుతున్న పంటల వివరాలను రైతువారీగా పంట పొలాల వద్దకే వెళ్లి నమోదు చేయాలి. కానీ ఆఫీసులకే పరిమితమై తూతూ మంత్రంగా పంట లెక్కలు కడుతున్నారు.

**ఇలా బయటపడింది..**

పొద్దు తిరుగుడు పంటకు గతేడాది మంచి ధర వచ్చింది. ఈ ఏడాది కూడా మంచి ధర వస్తుందనే ఆశతో బోధన్ డివిజన్ పరిధిలోని కోటగిరి, రెంజల్, నవీపేట్, బోధన్ మండలాల్లోని కొంత మంది రైతులు యాసంగిలో పొద్దు తిరుగుడును సాగు చేశారు. ప్రభుత్వం కూడా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రైవేట్ కంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు రూ. 6,400 వరకు ధర వస్తుండడంతో రైతులు వారం క్రితం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వెళ్లగా అక్కడ సన్‌ఫ్లవర్‌కు బదులుగా వరి సాగు చేసినట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. దీంతో కొనుగోలు సాధ్యం కాదని నిర్వాహకులు తేల్చేశారు. ఇలా నాలుగైదు మండలాల్లో 200 ఎకరాల వరకు పొద్దుతిరుగుడుకు బదులు వేరే పంట నమోదైంది. దీంతో 50 మందికి పైగా రైతులు తమ పంటను విక్రయించుకోలేని పరిస్థితి ఏర్పడింది.

**సరి చేయిస్తున్నాం**

జిల్లాలో కొన్ని చోట్ల పంటల వివరాలు ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదైనట్లు నా దృష్టికి వచ్చింది. వాటిని సరి చేయడానికి కమిషనర్ కార్యాలయానికి రోల్‌బ్యాక్ చేశాం. ఎన్ని ఎకరాలనే వివరాలను తర్వాత వెల్లడిస్తాం.

– ఆర్ తిరుమల ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

# కొనుగోళ్లకు వేళాయే..

- జిల్లాలో 458 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- ఈనెల 15 నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు
- ఏర్పాట్లలో పౌరసరఫరాలు, సహకార, ఇతర శాఖలు నిమగ్నం
- నేడు కలెక్టర్ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం



సుభాష్‌నగర్ : జిల్లా వ్యాప్తంగా ధాన్యం కోతలు మొదలయ్యాయి. ఇప్పటికే వర్ని, మోస్రా, చందూర్, సిరికొండ, మోపాల్, కోటగిరి, తదితర మండలాల్లో వరి కోతలు ఊపందుకున్నాయి. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా, జిల్లాలో కేంద్రాల ఏర్పాటులో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. తేమశాతం మిషన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం మిషన్లు, సామగ్రిని తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

**11 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా..**

జిల్లా వ్యాప్తంగా 3.95 లక్షల పైచిలుకు ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారు 11 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు భావిస్తున్నారు. రైస్ మిల్లులు, విత్తనాలు, ఇతర అవసరాలు పోను తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులను కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే అవకాశముందని అంచనా వేస్తున్నారు. సేకరణ కోసం ప్రాథమిక సహకార సంఘాలు, మెప్మా, ఐకేపీ, డీసీఎంఎస్ తదితర సంస్థల ద్వారా 458 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మొత్తం 305 వరకు రైస్‌మిల్లులు వర్కింగ్‌లో ఉన్నాయి. అందులో 75 బాయిల్డ్ రైస్‌మిల్లులు, 230 రా రైస్‌మిల్లులు ఉన్నాయి. 2.25 కోట్లకు పైచిలుకు గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**కొన్ని మండలాల్లో ఇప్పటికే షురూ..**

జిల్లాలో వరి కోతలు మరింత ఊపందుకోనున్న దశలో ఈ నెల 15 వరకు ఆయా గ్రామాల్లో కేంద్రాలు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని, కోటగిరి, పోతంగల్, చందూర్, తదితర మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. రైస్‌మిల్లుల అలాట్‌మెంట్ ప్రక్రియ కొనసాగుతోంది. సీఎంఆర్ 75 శాతం నుంచి 80 శాతం వరకు పూర్తయితేనే ధాన్యం అలాట్‌మెంట్ ఇవ్వాలనే ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పనిసరిగా పాటిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ధాన్యం రవాణాకు టెండర్ ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు చేసుకుంటుండగా, ధాన్యం రవాణాను ఈసారి పూర్తిగా ప్రక్షాళన చేసే అవకాశముంది.

**పకడ్బందీగా..**

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేందుకుగాను కలెక్టర్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించనున్నారు. సహకార, పౌరసరఫరాలు, మార్కెటింగ్, ఐకే పీ, మెప్మా, ఆర్టీఏ, రెవెన్యూ, వ్యవసాయ తదితర శాఖల అధికారులతోపాటు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. సమావేశంలో కలెక్టర్ కీలక సూచనలు చేసే అవకాశముంది. ధాన్యం సేకరణలో రాష్ట్రంలో మొదటి వరుసలో ఉండే జిల్లాకు కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత వచ్చిన సీజన్ కావడంతో పాలనాధికారి ఈ ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నారు.

# ముదురుతున్న ఫ్లెక్సీ వివాదం

- బోధన్ చైర్‌పర్సన్ భర్త, కౌన్సిలర్ శరత్ రెడ్డితో పాటు 9 మందిపై కేసు

బోధన్‌టౌన్(బోధన్) : బోధన్ బీఆర్ఎస్ పార్టీలో ఫ్లెక్సీల ప్రోటోకాల్ వివాదం రోజురోజుకూ ముదురుతోంది. స్థానిక ఎమ్మెల్యే షకీల్, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ భర్త శరత్ రెడ్డి మధ్య కొంత కాలంగా నెలకొన్న అంతర్గత విభేదాలు కేసులకు దారితీశాయి. సోమవారం పట్టణంలో చైర్‌పర్సన్ తూము పద్మ భర్త శరత్ రెడ్డి అమ్మ తూము శివమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఎమ్మెల్యే ఫొటో ఏర్పాటు చేయకపోవడంపై వివాదం రాజుకుంది. పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ చైర్‌పర్సన్ భర్త కౌన్సిలర్ శరత్ రెడ్డికి ఫోన్ చేసి ఫ్లెక్సీలను తొలగించాలని సూచించారు. దీంతో పోలీస్‌స్టేషన్‌కు కౌన్సిలర్ శరత్ రెడ్డి తమ పార్టీ నేతలతో పాటు ఇతర పార్టీ నాయకులతో వెళ్లారు. అక్కడ సీఐ లేకపోవడంతో ఏసీపీ కిరణ్ కుమార్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు పట్టణ పీఎస్‌కు గుంపుగా వచ్చి విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా, పోలీసులను దుర్భాషలాడిన బీఆర్ఎస్ కౌన్సిలర్ శరత్ రెడ్డితో పాటు ఇతర పార్టీల నాయకులు 9 మందిపై పోలీసులు కేసునమోదు చేశారు. సీఐ ప్రే మ్‌కుమార్‌ను వివరణ కోర గా సోమవారం కౌన్సిలర్ శరత్ రెడ్డితో పాటు ఇతర పార్టీల వ్యక్తులు పోలీసుల విధులకు ఆటంకం కలిగించారన్నారు.

# అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని ప్రభుత్వం ఈనెల 14న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జిల్లానుంచి సెగ్మెంట్ నుంచి 300 మందిని తీసుకెళ్లే విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం వీసీలో అధికారులతో సమీక్షించారు. సభకు తరలివెళ్తున్న ప్రతిఒక్కరి పేరు, సెల్ నెంబర్, పూర్తి వివరాలు సేకరించాలని, వారివెంట బస్సులో వెళ్లే లైజన్ ఆఫీసర్ వద్ద ఈ జాబితా ఉండాలన్నారు. వారికి గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు సభా ప్రాంగణానికి చేరుకునేలా చూడాలన్నారు. సభకు వెళ్తున్న వారి పూర్తి బాధ్యత అధికారులేదన్నారు. ప్రతి వాహనంలోనూ మంచినీళ్లు, ఫస్ట్‌ఎయిడ్ బాక్స్, స్నాక్స్ అందుబాటులో ఉంచాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జెడ్పీ సీఈఓ గోవింద్, డీఆర్డీఓ చందర్, మెప్మా పీడీ రాములు, డీపీవో జయసుధ, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి శశికళ, ఆర్టీసీ ఆర్ఎం ఉషాదేవి, ఆర్డీఓలు అధికారులున్నారు.

# పూలే ఆదర్శప్రాయుడు : ఎమ్మెల్యే బిగాల

నిజామాబాద్‌అర్బన్ : మహాత్మా జ్యోతిబా పూలే సాంఘిక దురాచారాలను రూపుమాపిన గొప్ప వ్యక్తి అని, ఆయన అందరికీ ఆదర్శప్రాయుడని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. మంగళవారం మహాత్మాజ్యోతిబా పూలే జయంతి కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బిగాల మాట్లాడుతూ దాదాపు 200 ఏళ్ల క్రితం సమాజంలో ఉన్న రుగ్మతలను రూపుమాపేందుకు పూలే గొప్ప కృషి చేశారన్నారు. మహిళల విద్య కోసం ప్రత్యేకంగా మొట్టమొదటి పాఠశాలను స్థాపింపజేశారన్నారు. పూలే ఆలోచనలకు ప్రభావితమైన అంబేడ్కర్ పూలేను తన గురువుగా ప్రకటించారన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో గురుకులాలకు జ్యోతీబాపూలే పాఠశాలలుగా నామకరణం చేస్తూ నాణ్యమైన భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తోందన్నారు. బీసీ సంఘాల విజ్ఞప్తి మేరకు నగరంలో బీసీ స్టడీ సర్కిల్, బీసీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. జెడ్పీ చైర్మన్ విఠల్ రావు మాట్లాడుతూ పూలే సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించి దురాచారాలను రూపుమాపారన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ పూలే ప్రత్యేకించి బాలికల విద్య కోసం పాఠశాలలు నెలకొల్పారన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో గ్రామాభివృద్ధి కమిటీల పేరుతో సాంఘిక బహిష్కరణలు విధిస్తే, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య, మెప్మా పీడీ రాములు, బీసీ సంఘాల బాధ్యులు నరాల సుధాకర్, బుస్సా ఆంజనేయులు, యెండల ప్రదీప్, మాడవేడి వినోద్ కుమార్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

మేయర్ దండు నీతూకిరణ్ మాట్లాడుతూ పూలే ఆనాటి సమాజంలో రుగ్మతలను దూరం చేసేందుకు చదువు ఒక్కటే సరైన మార్గం అని గుర్తించి ఆ దిశగా కృషి చేశారన్నారు. అంతకు ముందు వినాయక్ నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద మహాత్మా పూలే విగ్రహానికి జెడ్పీ చైర్మన్, కలెక్టర్, బీసీ సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# యథేచ్ఛగా జలచౌర్యం

- నగరంలో పెరిగిపోతున్న అక్రమ నల్లా కనెక్షన్లు
- సుమారు 12 వేలకు పైగానే..
- ఏళ్లుగా మున్సిపల్ ఆదాయానికి గండి
- పర్యవేక్షణ చేయని అధికారులు



నిజామాబాద్‌నాగారం : నగరంలో ఏళ్ల తరబడిగా నీటి కనెక్షన్ల పేరుతో దోపిడీ జరుగుతోంది. స్వయంగా మున్సిపల్ సిబ్బందే అక్రమ నల్లా కనెక్షన్లు పెరగడానికి కారణమవుతున్నారు. లబ్ధిదారుల నుంచి ఎంతోకొంత తీసుకుని స్థానికంగా విధుల్లో ఉండే మున్సిపల్ సిబ్బందే అక్రమ నల్లా కనెక్షన్ ఇచ్చేస్తున్నారు. ఆ కనెక్షన్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో మున్సిపల్ కార్పొరేషన్ భారీగా ఆదాయాన్ని కోల్పోతోంది.

తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి రూ. 1కే నల్లా కనెక్షన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెల్ల రేషన్ కార్డు లేకపోతే రూ. 7వేల ఫీజు కట్టాల్సి ఉంటుంది. కమర్షియల్( వ్యాపార వాణిజ్య సంస్థలు) అయితే రూ. 50 వేల నుంచి రూ. లక్షా యాభై వేలకు పైగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ కనెక్షన్లంటికీ తప్పనిసరిగా మున్సిపాలిటీకి దరఖాస్తు చేసుకుంటే సంబంధిత ఇంజినీరింగ్ సెక్షన్ సిబ్బంది మన ఇంటికి వచ్చి నల్లా కనెక్షన్ ఇస్తారు. ఇక్కడే మతలబుంది. నగరంలోని ఆయా ప్రాంతాల్లో విధుల్లో ఉండే మున్సిపల్ సిబ్బందికి ఎంతో కొంత సెటిల్ చేస్తే వారే గుంత తవ్వి నల్లా కనెక్షన్లు ఇచ్చేశారు. ఇలా నగరంలో సుమా రు 12 వేలకు పైగా అక్రమ నల్లా కనెక్షన్లు ఉన్నాయి. దీంతో బల్దియాకు భారీగా ఆదాయానికి గండి పడుతోంది.

**మున్సిపల్ సిబ్బందికి తెలిసినా..**

నగరంలో 60 డివిజన్లు ఉన్నాయి. మొత్తంగా 26వేలకు పైగా నల్లా కనెక్షన్లు ఉన్నాయి. తెల్ల రేషన్‌కార్డు ఉండి నల్లా కనెక్షన్ తీసుకున్నవారు నెలకు రూ.100 కట్టాల్సి ఉంటుంది. అయితే 12వేలకు పైగా అనధికార కనెక్షన్లు ఉన్నాయి. అయితే కొన్ని ప్రాంతా ల్లో ఏళ్లతరబడిగా మున్సిపల్ నీళ్లను అక్రమంగా వాడుకుంటున్నారు. అయితే అవి ఎక్కడెక్కడ ఉన్నాయో కూడా సంబంధిత అధికారులకు తెలియకపోవడం శోచనీయం. ఏళ్ల తరబడిగా అక్రమ కనెక్షన్ల జోలికి అధికారులు వెళ్లకపోవడం కూడా అనుమానాలకు తావిస్తోంది. మున్సిపల్ సిబ్బంది అనధికార నల్లా కనెక్షన్ ఉందని తెలిసి వసూళ్లు చేసుకుని వదిలేస్తున్నారనే ఆరోపిస్తున్నారు.

**ఇంటి కుళాయి పేరుతో..**

ఇక్కడ మరో రకం దందాకు కూడా మున్సిపల్ సిబ్బంది తెర తీశారు. నగరంలో సుమారుగా 3 వేలకు పైగా వ్యాపార వాణిజ్య సంస్థలున్నాయి. హోటళ్లు, ఆస్పత్రులు, దుకాణాలు ఇలాంటివన్ని కమర్షియల్ కిందికి వస్తాయి. అయితే వ్యాపార సంస్థలకు వాటర్ కనెక్షన్ అంటే హాఫ్ ఇంచ్‌కు రూ. 50వేలు, మూడోవంతు రూ. 90 వేలు, ఒక్క ఇంచ్‌కు రూ. లక్ష 50వేల ఫీజు డిపాజిట్ చేయాలి. ఇంత డిపాజిట్ చేయకుండా ఇంటి కుళాయి పేరుతో కనెక్షన్ తీసుకుని దానిని కమర్షియల్‌గా వాడుకుంటున్నారు.

**నల్లా కనెక్షన్ల వివరాలివి..**

| | |
|---|---|
| డివిజన్లు | 60 |
| అధికారికంగా కుళాయిలు | 26 వేలు |
| అనధికారిక కుళాయిలు | 12 వేలు |
| తెల్లరేషన్‌కార్డు ఉంటే నెలకు | రూ. 100 చార్జీ |
| వ్యాపార వాణిజ్య సంస్థలు | రూ. 1500 చార్జీ |

# హమ్మయ్య.. పరీక్షలు ముగిశాయ్..



పరీక్షలు ముగియడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

**పదవ తరగతి** పరీక్షలు ముగిశాయి. ఈనెల 3న ప్రారంభమైన పరీక్షలు మంగళవారం వరకు జరిగాయి. ఈ ఏడాది పరీక్షల్లో ఆరు పేపర్లు మాత్రమే ఉన్నాయి. డీఈవో దుర్గాప్రసాద్ 9 పరీక్ష కేంద్రాలను, ప్రత్యేక అధికారులు 53 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ముగ్గురు డిబార్ అయ్యారు. ఐదుగురు టీచర్లు ఉపాధ్యాయులు సస్పెండ్ అయ్యారు. ఇన్నాళ్లు హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు తమ సామగ్రితో ఇళ్లకు పయనమయ్యారు.

- నిజామాబాద్ అర్బన్,
సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



సామగ్రితో ఇంటికి వెళ్తున్న విద్యార్థిని

## క్లుప్తంగా

### మెంగారంలో మద్య నిషేధం

**లింగంపేట:** మండలంలోని మెంగారం గ్రామంలో మద్య నిషేధం పాటిస్తున్నట్లు మంగళవారం గ్రామస్తులు తీర్మానం చేశారు. గ్రామంలో బెల్టు షాపులు నిర్వహించొద్దని గ్రామ పెద్దలు తీర్మానం చేశారు. ఈ నెల 19 నుంచి గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయాలు జరిపితే రూ.20 వేల జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

### దరఖాస్తులకు ఆహ్వానం

**నిజామాబాద్అర్బన్:** ఐటీఐ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంజినీరింగ్ కోర్సుల్లో డిప్లొమా చేయడానికి దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ బాలుర ప్రిన్సిపాల్ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో అన్ని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలు ఉన్నాయన్నారు. రెండేళ్ల ఐటీఐ కోర్సుల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ నిర్వహించిన బ్రిడ్జి కోర్సు ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఈ నెల 20 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 300, ఇతరులు రూ.500 డీడీ తీసి ప్రిన్సిపాల్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ, మసాబ్ ట్యాంక్ హైదరాబాద్ పంపాలన్నారు. వివరాలకు 9441784849 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### పరీక్ష ఫీజు చెల్లించాలి

**తెయూ(డిచ్‌పల్లి):** తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షల ఫీజును మే 8వరకు చెల్లించవచ్చని కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో మే 10వరకు, రూ.500 ఫైన్‌తో మే 11వరకు, రూ.వేయి అపరాధ రుసుముతో మే 12వరకు, రూ.2వేలతో మే 13వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని తెలిపారు.

### కెమిస్ట్రీ టాపర్లకు డీఎస్‌టీ ఇన్‌స్పైర్ ఫెలోషిప్



**తెయూ(డిచ్‌పల్లి):** తెలంగాణ యూనివర్సిటీ కెమిస్ట్రీలో టాపర్లుగా నిలిచిన బి శిరీష (ఆర్గానిక్ కెమిస్ట్రీ), బి మహేశ్వరి (ఎమ్మెస్సీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ) డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ) ఫెలోషిప్‌కు ఎంపికైనట్లు విభాగాధిపతి జి బాలకిషన్ తెలిపారు. ఈ ఫెలోషిప్ ద్వారా విద్యార్థినులకు ఐదు సంవత్సరాల పాటు నెలకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు ఉపకార వేతనం అందుతుందని చెప్పారు. అత్యుత్తమ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేయడానికి అవకాశం కలుగుతుందన్నారు. మంగళవారం వీసీ డి రవీందర్ ఫెలోషిప్‌కు ఎంపికైన విద్యార్థిని శిరీషను అభినందించారు.

### రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికలు



**నిజామాబాద్‌నాగారం:** అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నాగారంలోని రాజారాం స్టేడియంలో అండర్-20 బాలబాలికలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 15,16 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. వీరికి 12, 13, 14 తేదీల్లో కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నరాల రత్నాకర్, రాజాగౌడ్ తెలిపారు.

# పనులు ఆగమాగం.. రోడ్లు నాసిరకం

- నాణ్యత పాటించని కాంట్రాక్టర్లు
- క్యూరింగ్ చేయకున్నా.. ఆన్‌లైన్‌లో పూర్తయిన ఎంబీలు

'నర్సింగ్‌పల్లిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ఇటీవల చేపట్టిన రోడ్డు ఇది. గతంలోనే ఇక్కడ సీసీ రోడ్డు ఉంది. రోడ్డు విస్తరణలో భాగంగా పాత రోడ్డుకు ఆనుకుని రూ. 5 లక్షలతో కొత్తది వేశారు. ఆ రోడ్డు సక్రమంగా వేయకపోవడంతో దారి గుండా వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. క్యూరింగ్ చేయకపోగా, మార్జిన్‌కు ఇరువైపులా మొరం వేయలేదు.



**మోపాల్:** మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో 2022- 23వ ఆర్థిక సంవత్సరానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి రూ.2.65 కోట్లు మంజూరయ్యాయి. వీటిని 34 పనులు(రోడ్లు)గా విభజించి గ్రామాల్లో సీసీ రోడ్లు వేశారు. ఇందులో 28 పనులు పూర్తయ్యాయి. మిగిలిన రోడ్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పనులు మార్చి 31లోపు పూర్తిచేయాలని గడువు విధించారు. మండలంలో 70 శాతం పనులు చివరి మూడ్రోజుల్లో ఆగమేఘాల మీద చేపట్టారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు పనులను పరిశీలించి నాసిరకం ఉన్న రోడ్లకు సంబంధించి ఏ మేరకు రికవరీ చేస్తారో వేచి చూడాలి.

**పూర్తయిన ఆన్‌లైన్ ఎఫ్‌టీవో..**

మార్చి చివరి వారంలో మంజూరైన సీసీ రోడ్ల పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశాలు రావడంతో ఆగమేఘాల మీద కాంట్రాక్టర్లు చేపట్టారు. ఒక దశలో మిల్లర్, కంకర కొరత ఏర్పడింది. సీసీ రోడ్ల పనుల్లో గుత్తేదారులు డస్ట్ మోతాదుకు మించి, మట్టితో కూడిన ఇసుకను వాడారు. అంతేగాకుండా రోడ్డు పూర్తయిన తర్వాత క్యూరింగ్ చేయకుండానే ముగించారు. ఎక్కడ కూడా మార్జిన్‌కు ఇరువైపులా మొరం పోయలేదు. 31 లోపు పూర్తి చేయాలని చెప్పి ఆన్‌లైన్ ఎఫ్‌టీవోను 29నే క్లోజ్ చేశారు. నాణ్యత పాటించకపోయినా ఎంబీలు, ఆన్‌లైన్ ఎఫ్‌టీవోను కూడా అధికారులు పూర్తిచేశారు. కాగా ఇదే విషయమై పంచాయతీరాజ్ ఏఈ శ్రవంతి వివరణ కోరగా, నాణ్యతతో సీసీ రోడ్డు పనులు చేసేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

**అందిన కాడికి కమీషన్లు..**

ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా చేపట్టిన 34 పనుల బాధ్యతలను సర్పంచులు, ఎంపీటీసీలకు అప్పగించారు. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో నలుగురైదుగురు ప్రజాప్రతినిధులే కాంట్రాక్టర్లుగా అవతారమెత్తారు. చాలా పనులను కమీషన్లు తీసుకుంటూ వారికి అప్పగించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అందిన కాడికి కమీషన్లు దండుకుంటూ రోడ్ల పనుల నాణ్యతను విస్మరించారు. 5 శాతం వరకు కమీషన్లు తీసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒకటి, రెండు గ్రామాల్లో తాజాగా వేసిన రోడ్లు పగుళ్లు ఏర్పడినట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# తండ్రి చనిపోయిన బాధతోనే పరీక్షకు..



కుమ్మరి మనోజ్

**మద్నూర్:** ఇంట్లో తండ్రి మృతదేహం.. మనసులో భరించలేని దుఃఖం.. మరో వైపు పదో తరగతి పరీక్ష.. అయినా దుఃఖాన్ని దిగమింగుకొని పరీక్షకు హాజరయ్యాడో విద్యార్థి. వివరాలు.. మద్నూర్ మండలం మేనూర్‌కు చెందిన కుమ్మరి మనోజ్ పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. మనోజ్ తండ్రి పరుభు తీవ్ర అనారోగ్యంతో సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మంగళవారం అంత్యక్రియలు జరపాల్సి ఉంది. మనోజ్ మేనూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివాడు. మద్నూర్‌లోని బాలుర గురుకుల పాఠశాల సెంటర్‌లో మనోజ్ పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. మంగళవారం చివరి పరీక్ష ఉండటంతో నాన్న లేడన్న బాధను మనస్సు లో దాచుకొని పరీక్ష రాశా డు. పరీక్ష అనంతరం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు.

# పరిశోధనలు భావితరాలకు బాటలు

**తెయూ(డిచ్‌పల్లి):** ప్రజల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు ఉండాలని తెలంగాణ యూనివర్సిటీ కామర్స్ డీన్, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి సూచించారు. పరిశోధనలు భావితరాలకు, భవిష్యత్ ప్రగతికి బాటలుగా మారుతాయన్నారు. తెయూ క్యాంపస్‌లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సౌతర్న్ రీజనల్ సెంటర్, తెలంగాణ యూనివర్సిటీ భాగస్వామ్యంలో 'ఆన్‌సైట్ రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ ఫర్ పీహెచ్‌డీ స్టూడెంట్స్/యంగ్ ఫ్యాకల్టీ ఇన్ సోషల్ సైన్స్' అనే అంశంపై రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యాదగిరి మాట్లాడుతూ.. పరిశోధన అనేది సృజనాత్మకంగా జ్ఞానాన్ని పొందే పద్ధతి అని తెలిపారు. సైన్సు పరిశోధనల ఫలితాలు స్థిరంగా ఉండగా, సామాజిక శాస్త్రాల పరిశోధనల ఫలితాలు చలన స్థితిలో ఉంటాయని యాదగిరి పేర్కొన్నారు. రిసోర్స్ పర్సన్ రాంబాబు మాట్లాడుతూ.. సరైన పరిశోధనకు సరైన శాంపిల్స్ ఎంచుకున్నప్పుడే నాణ్యమైన ఫలితం వస్తుందన్నారు. సీహెచ్ ఆంజనేయులు మాట్లాడు తూ.. అనేక అధ్యయనాల తర్వాత జరిగే పరిశోధన అద్భుతమైన ఫలితాలను రాబడుతుందన్నారు. కో–ఆర్డినేటర్ పున్నయ్య, వివిధ యూనివర్సిటీల నుంచి వచ్చిన పరిశోధకులు, యువ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.



శిక్షణనిస్తున్న డీన్ యాదగిరి

# 'ముదిరాజ్ కులస్తులను విడుదల చేయాలి'



తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ కులస్తులు

**మాచారెడ్డి:** చేపల చెరువు వివాదంలో అరెస్ట్ చేసిన మంతన్ దేవునిపల్లి ముదిరాజ్ కులస్తులను బేషరతుగా విడుదల చేయాలని దేవునిపల్లి ముదిరాజ్ మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మహిళలు ముదిరాజ్ సంఘ నాయకులతో కలిసి మంగళవారం పోలీస్ స్టేషన్, తహసీల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడారు. ఈ నెల 7న ఇసాయిపేట గ్రామానికి చెందిన గంగపుత్రులు దేవునిపల్లి శివారులోని దేవర చెరువులో చేపలు పడుతుండగా అడ్డుకోబోతే తమపై దాడి చేశారని ఆరోపించారు. తాము ఆత్మరక్షణ కోసం ప్రతి దాడి చేశామని తెలిపారు. దీంతో మహిళలను మినహాయించి వృద్ధులు, యువకులు తేడా లేకుండా అందరిని అరెస్ట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్ట్ చేసిన ముదిరాజ్ కులస్తులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ సంఘం నాయకులు అబ్రబోయిన స్వామి, బట్టు విఠల్, నీల కంఠం, కొరివి నర్సింలు, నాగరాజు, రాజు, కృష్ణంరాజు ఉన్నారు.

### పంటల పరిశీలన



**పెద్దకొడప్‌గల్:** మండలంలోని చిన్న తక్కడ్‌పల్లి శివారులో జొన్న, వరి పంటలను మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కంకులు విడిచిన జొన్నకు ఎలాంటి మందు పిచికారి చేయొద్దని సూచించారు. కంకులు రాని జొన్నకు పురుగు ఆశిస్తే కార్బాప్ హైడ్రోక్లోరైడ్ 200 గ్రాములు ఎకరానికి పిచికారి చేయాలన్నారు. వరి కోతల సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఈవో ప్రియాంక, రైతులు ఉన్నారు.

# మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

**కామారెడ్డి రూరల్:** మహనీయుల అడుగుజాడల్లో యువతతోపాటు ప్రతి ఒక్కరు నడువాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. మంగళవారం లింగాపూర్‌లో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవన నిర్మాణం, స్త్రీ శక్తి భవనాలను ప్రారంభించిన అనంతరం గ్రామంలో రైతు బంధు కన్వీనర్ బండారి కల్పన రాంరెడ్డిల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతీబాపూలే సావిత్రిబాయి విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ...బలహీన వర్గాలను ముందుకు తీసుకురావాలనే తపనతో జ్యోతిబాపూలే దంపతులు ఎంతో కృషి చేశారన్నారు. మహనీయుల జీవిత చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అప్పట్లోనే జాతీయ నేతలు 200 పాఠశాలలను ఏర్పాటు చేయడం గొప్ప విషయమని కొనియాడారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే తనతోపాటు వేదికపైన ఉన్న ప్రజా ప్రతినిధులందరూ కూడా పదవులను అధిరోహించారని గుర్తు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ, కౌన్సిలర్లు పడిగే సుగుణ, కాసర్ల శ్రీనివాస్, ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



లింగాపూర్‌లో జ్యోతీబాపూలే, సావిత్రిబాయి విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ గోవర్ధన్

### డ్రోన్‌తో పురుగు మందు పిచికారి



**సదాశివనగర్:** రాజేంద్రనగర్ భారతీయ వరి పరిశోధన స్థానం, రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయంతో మండలంలోని అడ్లూర్ఎల్లారెడ్డిలో మంగళవారం డ్రోన్ ద్వారా వరికి పురుగు మందు పిచికారి చేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ అధికారి వెంకయ్య, కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్త నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత ఉపయోగంతో పెట్టుబడి, సమయం ఆదా అవుతాయన్నారు. 5 నుంచి 6 నిమిషాల్లో ఎకరం పొలంలో డ్రోన్ ద్వారా పురుగు మందును పిచికారి చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ సదాశివ రెడ్డి, ఏఈవో శ్రీనివాస్‌రెడ్డి, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

### పిల్లలతో సహా వివాహిత అదృశ్యం

**కామారెడ్డిక్రైం:** ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యమైన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి విద్యుత్ నగర్ కాలనీలో చోటుచేసుకుంది. భిక్కనూర్‌కు చెందిన విజయలక్ష్మికి గతంలో వివాహం జరిగి భర్త చనిపోయాడు. అప్పటికే ఆమెకు ఓ కుమార్తె ఉంది. కామారెడ్డిలో ఆటో నడిపిస్తూ జీవనం సాగించే హంద్రే శైలేష్‌తో ఆమెకు పరిచయం ఏర్పడి ఐదేళ్ల క్రితం వారు వివాహం చేసుకున్నారు. వారికి ఓ కుమారుడు జన్మించాడు. భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. ఈనెల 1న భర్తతో గొడవ పడిన ఆమె ఇంట్లో నుంచి ఇద్దరు పిల్లలను వెంట తీసుకుని వెళ్లిపోయింది. గతంలో సైతం ఆమె ఇదే విధంగా పలుసార్లు వెళ్లి తిరిగి వచ్చినట్లు శైలేష్ చెబుతున్నాడు. చాలా చోట్ల గాలించినా ఆమె ఆచూకీ తెలియక పోవడంతో దేవునిపల్లి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

# కార్యకర్తలకు అండగా ఉంటాం

అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కార్యకర్తలు, ప్రజలు

**నిజామాబాద్‌నాగారం:** బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. నగరంలోని 7, 25, 26, 48, 49 డివిజన్లకు సంబంధించి కోటగల్లీ మార్కండేయ మందిరం ప్రాంతంలో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. దురదృష్టవశాత్తు కార్యకర్తలు మరణిస్తే రూ.రెండు లక్షల ఇన్సూరెన్స్ అందిస్తున్నట్లు చెప్పారు. ఆత్మీయ సమ్మేళనాలతో కార్యకర్తల్లో మరింత చైతన్యం వస్తోందని పేర్కొన్నారు. రూ.25 లక్షలతో మార్కండేయ మందిరం పునర్నిర్మాణం చేసినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలు అమ లు చేస్తున్నారన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టె వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి కార్యకర్త ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలని వివరించాలన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని చెప్పారు. మేయర్ దండు నీతూకిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సిర్ప రాజు, యెనుగందుల మురళి, కంచర్ల సంతోష్, గాండ్ల లింగం, అనిల్ రావు, కృష్ణ, కార్పొరేటర్ సిరిగాదా ధర్మపురి, చింతకాయల రాజు, సిరాజ్ పాషా, సిర్ప సువర్ణ రాజు, ప్రసన్న సత్య పాల్, హనుమాండ్లు, మహేష్ పాల్గొన్నారు.



## క్రైం కార్నర్

### పాముకాటుతో వివాహిత మృతి



స్వరూప(ఫైల్)

**పిట్లం:** పాముకాటుతో వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని గద్దగుండు తండాలో చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. తండాకు చెందిన స్వరూప(26) సోమవారం రాత్రి తన ఇంట్లో కుటుంబ సభ్యులతో నిద్రిస్తుండగా చేతికి పాము కాటేసింది. పాటు కాటేసిన విషయం కుటుంబ సభ్యులకు చెప్పగా వెంటనే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ సరైన వైద్య సౌకర్యాలు లేకపోవడంతో వారు బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. విష ప్రభావం ఎక్కువ అవటంతో అక్కడి నుంచి నిజామాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో స్వరూప మృతి చెందింది. మృతురాలికి భర్త, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

**గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ..**

**బాల్కొండ:** ముప్కాల్ మండలం వేంపల్లి శివారులో జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ముప్కాల్ ఏఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని మహిళను వేగంగా వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

**బీబీపేట:** తాళం వేసిన ఇంట్లో చొరబడి నగదును ఎత్తుకెళ్లిన ఘటన సోమవారం రాత్రి శేరిబీబీపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జంగం కళావతి తన భర్తతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లింది. వారు తిరిగి వచ్చే సమయానికి అదే గ్రామానికి చెందిన ఆస్కె స్వామి ఇంట్లోకి చొరబడి రూ.40 వేల నగదును ఎత్తుకెళ్లాడు. అతనిని పట్టుకునే యత్నం చేసినప్పటికీ తప్పించుకొని పారిపోయాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

### చోరీ కేసుల్లో 18 నెలల జైలు

**దోమకొండ:** మండల కేంద్రంలో నాలుగు నెలల క్రితం వరుస దొంగతనాలకు పాల్పడిన వ్యక్తికి మంగళవారం 18 నెలల జైలు శిక్ష పడినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. భిక్కనూరు మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన బురింగారి సుమన్ దోమకొండలోని మెడికల్ షాపులు, మొబైల్ షాప్‌లో దొంగతనాలకు పాల్పడగా పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరు పరిచారు. కామారెడ్డి ద్వితీయశ్రేణి న్యాయమూర్తి వెంకటేష్ దుర్వ సదరు వ్యక్తికి 18 నెలల జైలు శిక్ష విధించారని ఎస్సై వివరించారు.

# చోరీ కేసులో ఒకరి అరెస్ట్





వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

**నాగిరెడ్డిపేట:** మండలంలోని పెద్ద ఆత్మకూర్ గ్రామానికి చెందిన కోట ఈశ్వరయ్య ఇంట్లో ఫిబ్రవరి 27న జరిగిన చోరీ కేసులో పోలీసులు ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఎల్లారెడ్డి సీఐ శ్రీనివాస్ విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి వివరాలను వెల్లడించారు. పెద్దఆత్మకూర్ గ్రామానికి చెందిన ఈశ్వరయ్య తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి సమీప బంధువు అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగింది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఆంజనేయులు సిబ్బందితో గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్స్ బృందాల చేత ఆధారాలను సేకరించారు. కాగా చోరీ ఘటనపై ఈశ్వరయ్య తన సమీప బంధువైన గ్రామంలోని కోడూరు సీతారాం అలియాస్ శ్రీనుపై అనుమానం వ్యక్తం చేశారని సీఐ తెలిపారు. విచారణలో భాగంగా దొంగతనం జరిగిన ఇంట్లో సేకరించిన వేలిముద్రలు సీతారాం వేలిముద్రలతో సరిపోలాయని చెప్పారు. ఈ మేరకు మంగళవారం సీతారాంను అదుపులోకి తీసుకొని విచారించగా అతను నేరం ఒప్పుకున్నాడన్నారు. నిందితుడి నుంచి ఐదు తులాల బంగారు ఆభరణాలు, 33తులాల వెండి పట్టగొలుసులతోపాటు రూ. 15వేల నగదును స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు. కాగా సీతారాం గతంలో దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్యాట్ ఫిన్‌కార్ప్‌లో జరిగిన చోరీయత్నం కేసులో నిందితుడని ఆయన వివరించారు. సమావేశంలో నాగిరెడ్డిపేట ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై ఉమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# హత్యానేరం కేసులో జీవిత ఖైదు

**కామారెడ్డి క్రైం:** పిల్లనిచ్చిన అత్తను పథకం ప్రకారం హత్య చేసిన కేసులో నిందితునికి కామారెడ్డి కోర్టు జీవితఖైదు విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలా ఉన్నాయి. రెండేళ్ల క్రితం బిచ్కుంద మండలం బండరెంజల్ గ్రామానికి చెందిన జువ్వి అంజవ్వ (44) అదృశ్యం అయినట్లు మొదట పోలీసులకు ఫిర్యాదు వచ్చింది. కేసు న మోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. రెండు రోజుల తర్వాత బాన్సువాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. ఎలాంటి ఆధారాలు లభించకపోయినప్పటికీ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, క్లూస్‌టీం బృందాల సహకారంతో హత్య చేసింది ఆమె అల్లు డు జువ్వి ప్రకాష్‌గా గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి విచారించగా కుటుంబ తగాదాల నేపథ్యంలో పథకం ప్రకారం ఇబ్రహీంపేట గ్రామ శివారులోని ముదెల్లి గుట్ట వద్దకు తీసుకెళ్లి బండరాయితో మోది హత్య చేసినట్లు ఒప్పుకొన్నాడు. అంతేగాకుండా మృతురాలి ఒంటిపై ఉన్న బంగారు గుండ్లు, మొబైల్ ఫోన్ అపహరించాడు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కామారెడ్డి మొదటి అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి లాల్‌సింగ్ నాయక్ నేరస్తునికి జీవితఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన బిచ్కుంద సీఐ కృష్ణ, అప్పటి సీఐ శోభన్, కోర్టు కానిస్టేబుల్ గోపి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వసంత రావును ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.

### రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

**కామారెడ్డి క్రైం:** ఓ వ్యక్తి అజాగ్రత్తగా బైక్ నడపడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో బైక్‌తో పాటు ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి ప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. వివరాలు.. దేవునిపల్లి గాయత్రినగర్‌లో నివాసం ఉండే అంబీర్ విజయలక్ష్మి జీవదాన్ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్స్‌గా పని చేస్తుంది. ఆమె తన స్కూటీపై ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన ఓ బైక్ ఢీకొంది. దీంతో ఆమె కింద పడింది. పక్కనే వచ్చిన మరో ఆటో సైతం బోల్తా పడింది. విజయలక్ష్మితో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న లక్ష్మి, నర్సయ్య, సుప్రియ, ఆటో డ్రైవర్ గడ్డం బాలయ్యకు గాయాలయ్యాయి. బైక్‌ను అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిని భిక్కనూర్ మండలం తిప్పాపూర్‌కు చెందిన విజయ్‌కుమార్‌గా గుర్తించారు. అతనికి కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

### కారు బోల్తా



**ఎడపల్లి:** ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ గ్రామ శివారులో మంగళవారం కారు బోల్తా పడింది. గ్రామానికి చెందిన సూర కిశోర్ కారులో వెళ్తుండగా అదుపు తప్పి పంట పొలాల్లో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో కారు డ్రైవ్ చేస్తున్న సూర కిశోర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.